సాక్షి ఖమ్మం

మంగళవారం। 13। ఆగస్టు। 2024



మరొకరికి ఆయుష్షు..

అంతిమశ్వాస విడిచిన వారి అవయవాలను దానం చేస్తే ఆపదలో ఉన్న ఇంకొకరికి జీవితాన్ని ప్రసాదించినట్లవుతుంది.

8లో



జ్వర నియంత్రణలో విఫలం

జ్వరాల నియంత్రణ చర్యల్లో ప్రభుత్వం విఫలమైందని మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు విమర్శించారు.

8లో

గరిష్టం / కనిష్టం
33° / 25°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల జల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

రవాణా శాఖ కార్యాలయాల్లో ఏజెంట్లకు చెక్

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంక్రైం: రవాణా శాఖ కార్యాలయాల్లో ఏజెంట్ల దందాపై అధికారులు దృష్టి సారించారు. 'అలా వస్తే పని ఐపోయినట్లే!' శీర్షికన 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి స్పందించారు. ఈమేరకు ఖమ్మం, వైరా, సత్తుపల్లి కార్యాలయాల్లోకి వాహనదారులు కాకుండా ఇతరులను అనుమతించలేదు. ఈవిషయమై ఇన్‌చార్జ్ ఆర్‌టీఓ వెంకటరమణ ఆదేశాలతో సిబ్బంది పర్యవేక్షించారు. కొన్నిచోట్ల ఏజెంట్లు రావడంతో వారిని సెక్యూరిటీ సిబ్బంది బయటకు పంపించారు. అయితే, ఇదంతా ఎన్నాళ్లు కొనసాగుతుందో వేచిచూడాలి.

బీఏఎస్ ఖాళీ సీట్లకు డ్రా ద్వారా ఎంపిక



విద్యార్థితో డ్రా తీయిస్తున్న డీడీ

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యాన బెస్ట్ అవైలబుల్ పథకానికి సంబంధించి జిల్లాలో డ్రాప్ ఔట్ అయిన సీట్ల భర్తీకి సోమవారం డ్రా నిర్వహించారు. వివిధ పాఠశాలల్లో 3నుంచి 9వ తరగతుల్లో 33 ఖాళీ సీట్లు ఉండగా.. 382 దరఖాస్తులు అందాయి. ఖమ్మంలోని డీపీఆర్‌సీ భవనంలో ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ ఆధ్వర్యాన డ్రా తీసి విద్యార్థులను ఎంపిక చేశారు. అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాల్వకు షెట్టర్

చెరువులకు చేరనున్న భక్తరామదాసు నీరు



ప్రవాహానికి అడ్డుగా షట్టర్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

తిరుమలాయపాలెం: మండలంలోని తిరుమలాయపాలెం, ఎదుళ్లచెరువు, రమణాతండా గ్రామపంచాయతీ పరిధిలోని ఎనిమిది చెరువులకు భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా సాగు అవసరాలకు నీరు అందించనున్నారు. ఈమేరకు చెరువుల్లోకి నీరు మళ్లించేలా సోమవారం ఇరిగేషన్ డీఈ బాణాల రమేష్‌రెడ్డి ఆధ్వర్యాన తిరుమలాయపాలెం సమీపాన ఎస్సారెస్పీ కాల్వపై షట్టర్ ఏర్పాటు చేసి ట్రయల్‌రన్ నిర్వహించారు. గతంలో షట్టర్ లేక కొన్ని చెరువులకు నీరు చేరక ఇబ్బందులు ఎదురయ్యేవి. ఇకపై మండలంలోని అన్ని చెరువులకు భక్తరామదాసు ద్వారా నీరు చేర్చాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించడంతో అధికారులు షట్టర్ ఏర్పాటు చేశారు. ఈమేరకు తిరుమలాయపాలెం, రమణాతండా చెరువులకు మంగళవారం నుండి సాగునీరు విడుదల చేయనున్నట్లు డీఈ తెలిపారు.

దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా వీరస్వామి



ఎం.వీరస్వామి

ఖమ్మంగాంధీచౌక్: ఉమ్మడి జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా ఎం.వీరస్వామికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ హన్మంతరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న ఏ.సులోచన ఇటీవల నల్లగొండకు బదిలీ అయ్యారు. అదే సమయాన వరంగల్ డీసీ కార్యాలయం సూపరింటెండెంట్ ఎం.వీరస్వామిని ఉమ్మడి ఖమ్మం అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. ప్రస్తుతం ఆయననే ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించడంతో బాధ్యతలు స్వీకరించారు. గతంలో పదేళ్లకు పైగా ఇక్కడ విధులు నిర్వర్తించిన ఆయనను ఉద్యోగులు, అర్చకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

కూసుమంచి: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. మండలంలోని కోక్యాతండాలో పర్యటించిన ఆయన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. గ్రామంలో ఫాగింగ్ చేయడంతో పాటు నీటి నిల్వలు తొలగించాలని గ్రామపంచాయతీ సిబ్బందికి సూచించారు. ఆతర్వాత పీహెచ్‌సీని తనిఖీ చేసి జ్వరాల తీవ్రతపై ఆరా తీశారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిషోర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పర్యాటకంగా మరింత అభివృద్ధి

'ఎకో టూరిజం'కు జిల్లా అనుకూలం

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- రూ.30కోట్లతో ఖిల్లాపై రోప్‌వే : పర్యాటక మంత్రి జూపల్లి
- మంత్రులు పొంగులేటి, తుమ్మలతో కలిసి బౌద్ధస్తూపం, ఖిల్లా, వైరా రిజర్వాయర్ పరిశీలన

ఖిల్లాపై కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు సూచనలు చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, జూపల్లి



ఖమ్మంవన్‌టౌన్: తెలంగాణలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసి ప్రపంచపటంలో నిలుపుతామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి ఖమ్మం ఖిల్లాను ఆయన సోమవారం సందర్శించారు. ఖిల్లాపై పర్యాటక అభివృద్ధికి ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించాక భట్టి మాట్లాడారు. రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం దృష్టి సారించినందున తక్కువ సమయంలో పనులు చేసేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో కిన్నెరసాని నుండి భద్రాచలం వరకు ఎకో టూరిజం, నేలకొండపల్లి నుండి జమలాపురం మీదుగా భద్రాచలం రామాలయం వరకు టెంపుల్ టూరిజంకు అనువుగా ఉంటుందని చెప్పారు. ఇక ఖమ్మం ఖిల్లాపై రోప్‌వే ఏర్పాటు డిమాండ్ చాన్నాళ్లుగా ఉన్నందున పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అనుమతి ఇచ్చారని త్వరలోనే పనులను ప్రారంభిస్తామని భట్టి తెలిపారు.

టూరిజం కొత్తపుంతలు : జూపల్లి

రాష్ట్రంలో టూరిజం కొత్త పుంతలు తొక్కనుందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. అంతర్జాతీయ పర్యాటకులు తెలంగాణకు వచ్చేలా అభివృద్ధి చేస్తామని.. తద్వారా ఆదాయం పెరుగుతుందని చెప్పారు. ఖమ్మం ఖిల్లాపై 0.9 కి.మీ. మేర రోప్ వే రూ.30కోట్లతో నిర్మిస్తామని తెలిపారు. అంతేకాక ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను వెడ్డింగ్ డెస్టినేషన్‌గా మారుస్తామని వెల్లడించారు.

వారసత్వ సంపదను పరిరక్షిద్దాం : తుమ్మల

ఏళ్లుగా వస్తున్న వారసత్వ సంపదలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం ఖిల్లాకు ఘనమైన చరిత్ర ఉన్నప్పటికీ రోప్‌వే నిర్మిస్తే తప్ప పర్యాటకులు వచ్చే అవకాశం లేదన్నారు. ప్రస్తుతం రోప్ వే మంజూరు కావడంతో త్వరలోనే పనులు మొదలవుతాయని, జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతున్నందున పర్యాటకుల సంఖ్య పెరుగుతుందని తెలిపారు.



రామదాసు ఆడిటోరియాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎంపీ రఘురాంరెడ్డి

వైరాలో కాటేజీలు, వాటర్ స్పోర్ట్స్

వైరా: వైరా రిజర్వాయర్‌ను టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి రిజర్వాయర్‌ను సందర్శించిన ఆయన మాట్లాడుతూ వైరా క్రాస్, అలుగుల కింద నుండి తల్లాడ వరకు ప్రత్యేక రహదారి నిర్మిస్తామన్నారు. అంతేకాక వాటర్ స్పోర్ట్స్ అందుబాటులోకి తీసుకొచ్చి పర్యాటకుల కోసం కాటేజీలు నిర్మించనుండడంతో పర్యాటక రాక పెరుగుతుందని తెలిపారు. ఈ సమావేశాల్లో రాష్ట్ర పర్యాటక సంస్థ, గిడ్డంకుల సంస్థ చైర్మన్లు పటేల్ రమేష్‌రెడ్డి, రాయల నాగేశ్వరరావు, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, ఖమ్మం మేయర్ పి.నీరజ, వైరామున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్‌తో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు ఫాతిమా జోహరా, బాలసాని లక్ష్మీనారాయణ, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, దొబ్బల సౌజన్య, శాఖమూరి రమేష్, సీతారాములు, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజని, బోయిన వేణు, జెర్రిపోతుల సత్యనారాయణ, కడియాల నరేష్, గరిడేపల్లి రామారావు, మైశా శంకర్, కొడాలి గోవిందరావు, బొర్రా రాజశేఖర్, శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, దార్నా రాజశేఖర్, మిట్టపల్లి నాగి, కొప్పురావూరి సుమంత్ పాల్గొన్నారు.

బౌద్ధ క్షేత్రం అభివృద్ధికి ప్రణాళిక

నేలకొండపల్లి: నేలకొండపల్లిలోని ప్రఖ్యాత బౌద్ధక్షేత్రం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధమయ్యాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. బౌద్ధక్షేత్రంతో పాటు రామదాసు ధ్యాన మందిరాన్ని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావుతో కలిసి సందర్శించిన ఆయన పూజలు చేశారు. ఆతర్వాత రామదాసు వాడిన బావిని పరిశీలించి నూతనంగా నిర్మించిన అడిటోరియం వివరాలు తెలుసుకున్నారు. ఆతర్వాత డిప్యూటీ సీఎం మాట్లాడుతూ దేశ విదేశాల నుంచి బుద్ధిస్టులను ఆహ్వానించి క్షేత్రాన్ని ప్రాచుర్యంలోకి తీసుకొస్తామన్నారు. ఇందుకోసం పర్యాటక శాఖ, పురావస్తుశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ మ్యూజియం ఏర్పాటు, ఎనిమిదెకరాల్లో అభివృద్ధిపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

కంగ్రాట్స్.. మీకు ఉద్యోగం వచ్చింది!

మున్సిపల్ శాఖ పేరిట నకిలీ ఉత్తర్వులు

ఖమ్మంమయూరిసెంటర్: 'మీకు ఈ విషయం తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మిమ్మల్ని మున్సిపల్ డిపార్ట్‌మెంట్‌లో రికార్డ్ అసిస్టెంట్‌గా నియమించాం. ఈ నియామకం సెప్టెంబర్ 9 నుంచి అమల్లోకి వస్తుంది. 11నెలల కాలానికి పనిచేయాల్సి ఉండగా నెల వేతనం రూ.27,679గా నిర్ణయించాం' అంటూ ఖమ్మంకు చెందిన ఎనమల ఘనరత్న పేరిట ఖమ్మం మున్సిపల్ డిపార్ట్‌మెంట్ డివిజనల్ ఆఫీసర్ నుంచి ఉద్యోగ నియామక పత్రం విడుదలైంది. ఈ లేఖ సోషల్ మీడియాలో వైరల్ కావడం.. లేఖలోని శాఖ వివరాలు, ఉద్యోగం వచ్చినట్లుగా పేర్కొన్న వ్యక్తి పేరు అనుమానాస్పదంగా ఉండడంతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సోమవారం విచారణకు ఆదేశించారు. దీంతో కేఎంసీ అధికారులు పరిశీలించి లేఖ నకిలీదని తేల్చారు. ఇంటి లేఖలను చూసి మోసపోవద్దని, ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తే నమ్మొద్దని సూచించిన అధి కారులు.. బాధ్యులపై చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.

సీఎం పర్యటనకు చకచకా ఏర్పాట్లు



వైరాలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన కేఎంసీ కమిషనర్ అభిషేక్, ఆర్‌డీఓ గణేష్

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్/వైరా: జిల్లాలోని వైరాలో ఈనెల 15న జరిగే సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నందున ఏర్పాట్లలో వేగం పెంచాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన జిల్లా అధికారులతో సీఎం పర్యటనపై సమీక్షించారు. భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం సీతారామ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించాక వైరాలో జరిగే సభకు సీఎం హాజరవుతారని తెలిపారు. ఈనెల 14న సీనియర్ అధికారులు, మంత్రులు జిల్లాకు రానున్నందున వసతి ఏర్పాట్లు కల్పించడంతో పాటు 15న స్వాతంత్య్ర దినోత్సవం ముగియగానే అధికారులు వైరాకు చేరుకోవాలని సూచించారు. ఈమేరకు హెలీప్యాడ్, వేదిక నిర్మాణం, అలంకరణ, ప్రొటోకాల్, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యుత్ సరఫరా, బందోబస్తుపై సూచనలు చేశారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సన్యాసయ్య, డీఆర్‌ఓ ఎం.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. తొలుత వైరాలో సభాస్థలి ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి స్టాళ్ల ఏర్పాటుపై అధికారులకు సూచనలు చేశారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఖమ్మం ఆర్‌డీఓ జి.గణేష్ పాల్గొన్నారు.

సీఎం భద్రాద్రి జిల్లా పర్యటన ఖరారు

సీతారామ పంప్‌హౌజ్–2 ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 15న భద్రాద్రి జిల్లా పర్యటనకు రానున్నారు. ఈమేరకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి సోమవారం షెడ్యూల్ విడుదలైంది. గోల్కొండ కోటలో స్వాతంత్య్ర దినోత్సవంలో పాల్గొన్న అనంతరం ఆయన హెలికాప్టర్‌లో బయలుదేరి ములకలపల్లి మండలం పూసుగూడెం చేరుకుంటారు. ఇక్కడ సీతారామ ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవంలో భాగంగా పంప్‌హౌజ్ 2లో మోటార్లను ఆన్ చేస్తారు. కాగా, సీతారామ పథకాన్ని ప్రారంభించాక వైరాలో జరిగే సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని రూ.2లక్షల రుణమాఫీ చెక్కులు అందిస్తారని తొలుత ప్రకటించారు. ఇప్పటికే వైరాలో సభ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తుండగా, పలుమార్లు మంత్రులు కూడా పరిశీలించారు. ఇంతలోనే సోమవారం కేవలం పూసుగూడెం పర్యటన షెడ్యూల్ మాత్రమే విడుదలైంది.

ఫిర్యాదులు పరిష్కరించండి

అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

ఖమ్మం సహకారనగర్: ప్రజలు అందించిన ఫిర్యాదులను తక్షణమే పరిశీలించి పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలు, ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు పెండింగ్ ఉంచకుండా పరిష్కరించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో డీఆర్వో రాజేశ్వరి, ఏఓ అరుణ, సూపరింటెండెంట్లు కారుమంచి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా గత సోమవారం నుంచి మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహిస్తుండగా ఎక్కువ మంది అక్కడే వినతిపత్రాలు ఇస్తున్నారు. దీనికి తోడు సోమవారం జిల్లాలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు పర్యటన ఉండడంతో అధికారులు వారి వెంట ఉంటారనే భావనతో కలెక్టరేట్‌లో ఎక్కువ మంది రాలేదు. దీంతో ప్రజావాణి వెలవెలబోయి కనిపించింది. కాగా, సెలవు దినాల్లో పాఠశాలలు నిర్వహిస్తున్న యజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం(టీపీటీఎఫ్) నాయకుడు కొరకొప్పు రామారావు విన్నవించారు.



వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

రెండు పోలీసుస్టేషన్లు అప్‌గ్రేడ్

ఖమ్మం రూరల్, ముదిగొండ ఎస్‌హెచ్‌ఓలుగా సీఐలు

ఖమ్మంరూరల్/ముదిగొండ: జిల్లాలోని రెండు పోలీస్‌స్టేషన్ల స్థాయి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ఖమ్మం రూరల్, ముదిగొండ పోలీసుస్టేషన్లకు ఇన్నాళ్లుగా ఎస్సైలే స్టేషన్ హౌస్ ఆఫీసర్లు(ఎస్‌హెచ్‌ఓ)గా వ్యవహరిస్తున్నారు. అయితే, రెండు స్టేషన్ల పరిధి అంతర్ జిల్లా సరిహద్దుల్లో ఉన్న నేపథ్యాన తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో భారీగానే కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యాన పరిపాలనా సౌలభ్యం, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఈ రెండింటిని అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇది అమల్లోకి వస్తే స్టేషన్లకు ఇక నుంచి సీఐ స్థాయి అధికారి ఎస్‌హెచ్‌ఓగా కొనసాగుతారు.



ముదిగొండ పోలీసుస్టేషన్

మత్స్యకారులకు శిక్షణ ప్రారంభం

కూసుమంచి: పాలేరులోని శ్రీ పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో వివిధ జిల్లాల మత్స్యకారులకు మూడు రోజుల పాటు ఇవ్వనున్న శిక్షణ సోమవారం ప్రారంభమైంది. హైదరాబాద్, వికారాబాద్, అనంతపురం, నంద్యాల జిల్లాల మత్స్యకారులు పాల్గొనగా వికారాబాద్ జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య ప్రారంభించి మాట్లాడారు. పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రంలో శిక్షణను తెలంగాణ, ఏపీ మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చేపల పెంపకంలో మెళకువలు అందిపుచ్చుకుంటే ప్రభుత్వ లక్ష్యాల మేరకు దిగుబడి సాధించొచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా మత్స్య విస్తరణాధికారి చాముండేశ్వరి, కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్, శాస్త్రవేత్త రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వికారాబాద్ అధికారి సౌజన్య


నిధులు రాక ఏడాది..

- నిండుకున్న మున్సిపాలిటీల ఖజానా
- పట్టణ ప్రగతి నిధులతోనే సగం పనులు
- ప్రస్తుతం కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో పడకేసిన అభివృద్ధి
- ఉమ్మడి జిల్లాకు బకాయి రూ.32కోట్ల పైమాటే...

ఖమ్మంమయూరిసెంటర్: నగరాలు, పట్టణాలను అభివృద్ధి చేయడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్స్(పట్టణ ప్రగతి) కింద కార్పొరేషన్లతో పాటు మున్సిపాలిటీలకు జనాభా ప్రాతిపదికన నిధులను కేటాయిస్తోంది. 2011 జనాభా లెక్కల ప్రకారమే ఈ నిధులు ఇస్తుండగా 13 నెలలుగా ఇవి పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు మున్సిపాలిటీలకు నిధులు అందక పనులు ముందుకు సాగడం లేదు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడిచినా నిధుల ఊసెత్తకపోవడంతో పాలకవర్గాలు, అధికారులు ఏం చేయాలో పాలుపోని స్థితి ఎదుర్కొంటున్నారు.

గ్రాంట్లపైనే ఆధారం..

ఉమ్మడి జిల్లాలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మినహా మధిర, సత్తుపల్లి, వైరా, కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు మున్సిపాలిటీలకు ఆదాయ వనరులు తక్కువే. దీంతో మున్సిపాలిటీలు ప్రభుత్వం నుండి వచ్చే గ్రాంట్లతోనే అభివృద్ధి పనులు చేపడుతాయి. ఖమ్మం కార్పొరేషన్‌లో ఆస్తి పన్నులు, ఇతర పన్నుల ద్వారా భారీగానే ఆదాయం వస్తుండడంతో ఉద్యోగులు, కార్మికుల వేతనాలు, పారిశుద్ధ్య వాహనాల నిర్వహణకు వెచ్చిస్తున్నారు. ఇక మున్సిపాలిటీల్లో కొత్తగూడెం మినహా ఇతర చోట్ల ఉద్యోగులు, కార్మికుల వేతనాలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం నుండి గ్రాంట్లను శానిటేషన్, చిన్నచిన్న అభివృద్ధి పనులకు వెచ్చిస్తారు. కానీ 13 నెలలుగా ప్రభుత్వం నుండి ఆ నిధులు రాక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



నిధుల వినియోగం ఇలా..

15వ ఫైనాన్స్, స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్స్ (పట్టణ ప్రగతి) నిధులను కార్పొరేషన్, మున్సిపాలిటీలు ఏయే అవసరాలకు వినియోగించుకోవచ్చో ప్రభుత్వం 2020లో ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధానంగా పారిశుద్ధ్య నిర్వహణకు అధిక మొత్తంలో ఖర్చు చేయొచ్చు. అలాగే, నర్సరీల అభివృద్ధి, మొక్కలు నాటడం, వైకుంఠధామాల అభివృద్ధి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు, పార్కులు, క్రీడా మైదానాలు, జిమ్‌లఅభివృద్ధి, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ, వీధి వ్యాపారాల ప్రాంగణాల అభివృద్ధి, నైట్ షెల్టర్లకు సైతం నిధులు వ్యయం చేసే వెసులుబాటు ఉంది. ఆదాయ వనరులు తక్కువగా ఉండే మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణకు, పారిశుద్ధ్య వాహనాల కొనుగోలుకు ఈ నిధులు ఉపయోగపడుతుంటాయి.

కార్పొరేషన్, మున్సిపాలిటీలకు పెండింగ్ బకాయిలు (అంచనా రూ.ల్లో)

కార్పొరేషన్ / మున్సిపాలిటీ	నిధులు
ఖమ్మం	13,29,99,958
సత్తుపల్లి	1,58,75,561
మధిర	1,62,94,369
వైరా	1,59,35,114
కొత్తగూడెం	3,64,01,261
ఇల్లెందు	1,56,09,659
మణుగూరు	1,59,01,106
పాల్వంచ	7,23,44,233
మొత్తం	32,13,61,261

జనాభా ప్రాతిపదికన నిధులు

ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు మున్సిపాలిటీలకు ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ కేటాయించింది. ఈ నిధులు పట్టణ ప్రగతి కింద మంజూరు చేస్తూ వచ్చింది. 2023 ఏడాది మే, జూన్ నెలల్లో ఖమ్మం కార్పొరేషన్‌కు రూ.1,02,30,766 చొప్పున, సత్తుపల్లికి రూ.12,21,197, మధిరకు రూ.12,53,413, వైరా రూ.12,25,778, కొత్తగూడెంకు రూ.28,00,097, ఇల్లెందుకు రూ.12,00,743, మణుగూరుకు రూ.12,23,162, పాల్వంచకు రూ.55,64,941 గత ప్రభుత్వం విడుదల చేసింది. ఆతర్వాత నిధులు జాడ లేకపోగా కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా స్పందన రావడం లేదు. ఫలితంగా కార్పొరేషన్, మున్సిపాలిటీలకు స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్లు రూ.కోట్లలో పెండింగ్ ఉన్నాయి.

నేడు శ్రీనివాసరావు స్మృతివనానికి శ్రీకారం

చంద్రుగొండ: గొత్తికోయల చేతిలో హతమైన అటవీ శాఖ రేంజర్ చలమల శ్రీనివాసరావు స్మృతి వనం ఏర్పాటుకు అధికారులు శ్రీకారం చుట్టారు. 2022 నవంబర్ 22న చంద్రుగొండ ఫారెస్ట్ రేంజి అధికారి శ్రీనివాసరావు హత్యకు గురయ్యారు. రెండేళ్లపాటు ఇక్కడ పనిచేసిన ఆయన అడవుల రక్షణకు ఎనలేని కృషి చేశారు. స్మగ్లర్లు, అక్రమ పోడుదారుల ఆటకట్టించారు. అటవీ ప్రాంతంలో అరుదైన ఔషధ మొక్కల పెంపకానికి కృషి చేశారు. పోడుసేద్యం పేరిట అడవులను నాశనం చేయొద్దంటూ అవగాహన కల్పిస్తూ అంకితభావంతో విధులు నిర్వర్తించారు. ఈక్రమంలో ఆయన హత్యకు గురికావడం రాష్ట్రంలోనే సంచలనంగా మారింది. ఈమేరకు శ్రీనివాసరావు సేవలు గుర్తుండిపోయేలా కనకగిరి అటవీప్రాంతం పోకలగూడెం బీట్ రావికంపాడు సెక్షన్‌లోని 25 ఎకరాల విస్తీర్ణంలో స్మృతి వనం ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు తెలిపారు. ఆయన సోమవారం పనులను పరిశీలించి మాట్లాడారు. ఇక్కడ మంగళవారం 16,666 మొక్కలు నాటుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సీసీఎఫ్ భీమానాయక్‌తోపాటు వివిధ జిల్లాల అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.



స్మృతివనం నిర్మించే ప్రాంతం

క్లుప్తంగా

సత్తుపల్లి ఆస్పత్రికి అనస్తీషియన్

సాక్షి ఎఫెక్ట్..

సత్తుపల్లిటౌన్: ఎట్టకేలకు సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలో అనస్తీషియన్ పోస్టు భర్తీ అయింది. ఇక్కడ విధులు నిర్వర్తించిన అనస్తీషియన్ బదిలీ కాగా శస్త్రచికిత్సలు నిలిచిపోయిన విషయమై 'ప్రసవ వేదన' శీర్షికన గత గురువారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సమస్యను డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. ఫలితంగా పెనుబల్లి ప్రభుత్వాస్పత్రి మత్తు డాక్టర్ పృథ్వీని సత్తుపల్లికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయగా ప్రభుత్వాస్పత్రిలో శస్త్రచికిత్స మొదలయ్యాయి.

అండర్-14 క్రికెట్ పోటీలకు ఎంపిక



క్రికెటర్లను అభినందిస్తున్న డీవైఎస్ఓ

ఖమ్మం స్పోర్ట్స్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యాన జరగనున్న రాష్ట్రస్థాయి అండర్-14 క్రికెట్ పోటీలకు జిల్లా నుంచి పలువురు బాలికలు ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఎంపిక పోటీలు జరగగా వివరాలను క్రికెట్ నెట్స్ కోచ్ ఎం.డీ.మతిన్ తెలిపారు. రాష్ట్ర జట్టుకు జిల్లా నుంచి దీప్తి, మనస్విని, యమున, గిరిజ, భవాని, గౌరి, రాధికకు స్థానం దక్కగా వీరిని డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి అభినందించారు

15న పరుగుపందెం పోటీలు

జిల్లాస్థాయి 400 మీటర్ల పరుగు పందెం ఎంపిక పోటీలు ఈనెల ఈనెల 15వ తేదీన ఖమ్మం సర్దార్ పటేల్‌స్టేడియంలో నిర్వహించనున్నట్లు అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.డీ.షఫీక్ అహ్మద్ తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు మొదలయ్యే పోటీలకు బాలబాలికలు వయసు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. ఇక్కడ ప్రతిభ చాటి క్రీడాకారులను మెదక్‌లో ఈనెల 17 18వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

నూరు శాతం ఫలితాల సాధనే లక్ష్యం



బోధనపై ఆరా తీస్తున్న డీఈఓ శర్మ

నేలకొండపల్లి: పదో తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు ఇప్పటినుంచే దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ సూచించారు. నేలకొండపల్లిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను సోమవారం తనిఖీ చేసిన ఆయన ఎస్సెస్సీ విద్యార్థుల ప్రగతిని పరీక్షించారు. అలాగే, వంట గదులను పరిశీలించి శుభ్రత, మెనూ అమలుపై సూచనలు చేశాక విద్యార్థుల హాజరుశాతం, బోధనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. నోడల్ ఆఫీసర్ చలపతిరావు, హెచ్ఎంలు రమేష్, రత్నకుమారి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్


ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యాన కల్చరల్ ఫైన్ ఆర్ట్ ఫెడరేషన్ బాధ్యులు హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన 8వ జాతీయ స్థాయి భరతనాట్యం పోటీల్లో హార్వెస్ట్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బృంద నృత్యంలోనే కాక పలు విభాగాల్లో జి.త్రిషికారెడ్డి, జి.వైశాలిరెడ్డి, ఎస్.వీ.కమలకళ పతకాలు సాధించారని హార్వెస్ట్ కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి తెలిపారు. వీరిని సోమవారంకరస్పాండెంట్, ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ఏసీబీ తనిఖీల కలకలం

మహబూబాబాద్ ఆర్‌టీఓ నివాసంలో సోదాలు

ఖమ్మంక్రైం: ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఏసీబీ అధికారులు సోమవారం ఖమ్మంలో తనిఖీలు చేపట్టారు. మహబూబాబాద్ ఆర్‌టీఓ గౌస్‌పాషాతో ఆయన అసిస్టెంట్ సుబ్బారావుపై అవినీతి ఆరోపణలు రావడంతో వరంగల్, హైదరాబాద్‌కు చెందిన అధికారులు తనిఖీలు చేపట్టారు. తొలుత విజయవాడలో సుబ్బారావును అదుపులోకి తీసుకుని ఖమ్మం వచ్చారు. ఇక్కడ విజయ్‌నగర్ కాలనీలోని గౌస్‌పాషా నివాసంలో సోదాలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,828

మనిషికి ఒకటే జన్మ.. కానీ మనిషి అవయవాలకు మాత్రం రెండు జన్మలు!

అవయవదానం చేస్తే మరణించినా మరో రూపంలో జీవించే అవకాశం ఏర్పడుతుంది. ఎవరైనా కన్నుమూసినప్పుడు సరైన సమయంలో గుండె, మూత్రపిండాలు, ప్యాంక్రియాస్, ఊపిరితిత్తులు, కాలేయం, చేతులు, ముఖం, కణజాలం, ఎముకమజ్జ, మూలకణాలు సేకరించగలిగితే మరో ఎనిమిది మంది ప్రాణాలు కాపాడొచ్చు. ఈ అవయవాలు పాడై దాతలు ముందుకు రాక ఎందరో ఎదురుచూపుల్లో గడుపుతున్నారు. మరికొందరు ఫలితం లేక కన్నుమూస్తున్నారు. ఈ నేపథ్యాన వివిధ సంస్థలు, వ్యక్తులు కల్పిస్తున్న అవగాహనతో ఇటీవలి కాలంలో అవయవదానానికి పలువురు ముందుకొస్తున్నారు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల కుటుంబీకులకు అవగాహన కల్పించడం ద్వారా వారు తమ కుటుంబీకుల అవయవదానానికి సిద్ధమవుతున్నారు. ఈ అంశం తెలిసిన ఇంకొందరు ముందుగానే ఒప్పంద పత్రాలు ఇస్తున్నారు. అయితే, మరణాల సంఖ్యకు తగినట్లుగా అవయవదాతలు లేక పలువురి జీవితం అర్ధంతరంగా ముగుస్తోంది. ఈ నేపథ్యాన నేడు (మంగళవారం) ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో అవదాయ దానం చేసి స్ఫూర్తిగా నిలిచిన పలువురిపై కథనం.

–సుజాతనగర్



అంతిమ శ్వాస విడిచినా.. మరొకరికి ఆయుష్షు పోశారు..

- అవయవదానంతో ఇంకొందరికి ప్రాణదానం
- ఉమ్మడి జిల్లాలో నానాటికీ పెరుగుతున్న అవగాహన
- ముందుకొస్తున్న పలు కుటుంబాలు
- నేడు ప్రపంచ అవయవదాన దినోత్సవం

టీవీ మెకానిక్.. పెద్దమనస్సు



కుమారస్వామి

అశ్వాపురానికి చెందిన బేతి కుమారస్వామి (51) టీవీ మెకానిక్. ఓరోజు బాత్‌రూంలో కుప్పకూలగా కుటుంబీకులు కొత్తగూడెం, ఖమ్మం ఆపై హైదరాబాద్ తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు ఆయన బ్రెయిన్ డెడ్ అయిందని ప్రకటించగా.. అంతా బాగున్న అవయవాల దానంపై అవగాహన కల్పించారు. దీంతో కుటుంబీకులు ముందుకు రాగా అవయవాలు సేకరించి అవసరమైన వారికి అమర్చారు.

అందరి అంగీకారంతో..



మరికుక్కల ఎలేంద్ర

మణుగూరులోని శివాజీనగర్‌కు చెందిన మరికుక్కల ఏలేంద్ర (53)కు నాలుగు నెలల కిందట బ్రెయిన్ స్ట్రోక్ రాగా చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. కోమాలోకి వెళ్లిన ఆమెను వివిధ ఆస్పత్రుల్లో చూపించినా ఫలితం కానరాలేదు. బ్రెయిన్ డెడ్ అయినందున అవయవాలు దానం చేయాలని జీవన్‌దాన్ ప్రతినిధులు సూచించారు. కుటుంబసభ్యుల అంగీకారం మేరకు ఈమె కళ్లు, లివర్, గుండె, కిడ్నీలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంతో..



పల్లె వెంకన్నగౌడ్

చంద్రుగొండ మండలం టీకులబంజరకు చెందిన రైతు పల్లె వెంకన్నగౌడ్ (52) కన్నుమూసినా ముగ్గురి జీవితాల్లో వెలుగు నింపాడు. కంటి పరీక్షల నిమిత్తం పాల్వంచ వెళ్తుండగా కారు ఢీకొనడంతో గాయపడిన ఆయనను హైదరాబాద్ తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. దీంతో జీవన్‌దాన్ ప్రతినిధులు అవగాహన కల్పించి వెంకన్నగౌడ్ శరీరం నుంచి కాలేయంతో పాటు, రెండు కళ్లను సేకరించారు.

వృద్ధురాలు.. స్ఫూర్తి



పెద్ది కొమరమ్మ

గరీబ్‌పేట గ్రామపంచాయతీ పరిధి లక్ష్మీపురం తండాకు చెందిన పెద్ది కొమరమ్మ (76) గత నెల 16న ఆస్పత్రికి వెళ్తుండగా ఆటో ఢీకొట్టింది. ఆమె తలకు బలమైన గాయం కాగా, సింగరేణి ఆస్పత్రిలో.. అక్కడి నుంచి హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అయినా ఫలితం లేక బ్రెయిన్ డెడ్ కావడంతో అవయవదానంపై వైద్యులు ఆమె కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. ఆపై మూత్రపిండాలు, కాలేయం సేకరించారు.

కన్నబిడ్డను కాపాడుకోవాలని..



కుమార్తెతో తల్లి భద్రమ్మ (ఫైల్)

సుజాతనగర్‌కు చెందిన బోడా హరినాయక్, భద్రమ్మ దంపతుల పెద్ద కుమార్తె స్నేహిత 12 ఏళ్ల వయసులో అనారోగ్యంతో కోమాలోకి వెళ్లింది. ఆమె రెండు కిడ్నీలు పనిచేయడం లేదని.. దాతలు దొరికితే కిడ్నీ మార్చాలని చెప్పారు. అది తప్ప మరో మార్గం లేదని తెలిపారు. దీంతో తల్లి భద్రమ్మ తన కిడ్నీ అందించింది. అయితే, కొన్నాళ్లు బాగానే ఉన్నా స్నేహిత ఆ తర్వాత పరిస్థితి విషమించి కన్నుమూసింది.

మరికొందరికి ప్రాణం



వనమా లీలావతి

కన్నుమూసినా నలుగురికి ఉపయోగపడ్డారు తల్లాడ మండలానికి చెందిన వనమా లీలావతి (65). గత ఏడాది ఆమె వెళ్తున్న బస్సును లారీ ఢీకొనగా గాయపడింది. ఆమెను హైదరాబాద్ తీసుకెళ్లేసరికి బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. అవయవదానంపై జీవన్‌దాన్ ప్రతినిధులు లీలావతి కుటుంబానికి వివరించగా స్పందన వచ్చింది. ఆమె నుంచి కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలను సేకరించి అవసరమైన వారికి అమర్చారు.

రక్తంలో ఇన్‌ఫెక్షన్‌తో...



రామాల స్వరూపారాణి

ఖమ్మంకు చెందిన రామాల స్వరూపారాణి (47) కాళ్లపై మచ్చలు ఏర్పడటంతో మందులు వాడుతోంది. ఈ క్రమంలోనే గత ఏడాది ఆమె ఒక్కసారిగా అనారోగ్యానికి గురయ్యారు. పరీక్షించిన వైద్యులు రక్తంలో ఇన్‌ఫెక్షన్ సోకి బ్రెయిన్‌కు చేరి డెడ్ అయినట్లుగా నిర్ధారించారు. దీంతో జీవన్‌దాన్ ప్రతినిధులు స్వరూపారాణి కుటుంబ సభ్యులను కలిసి మాట్లాడారు. అవయవదానానికి వారు అంగీకరించడంతో కళ్లు, గుండె, కిడ్నీలు సేకరించారు.

జ్వరనియంత్రణలో ప్రభుత్వ విఫలం

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి రంగారావు



మాట్లాడుతున్న పోటు రంగారావు, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: పల్లె, పట్నం తేడా లేకుండా రాష్ట్రవ్యాప్తంగా విష జ్వరాలు విజృంభిస్తున్నా నియంత్రణలో రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆరోపించారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞానకేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి ఏజెన్సీ పల్లెల వరకు జ్వరంతో వణికిపోతూ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అధికారిక లెక్కలకు తోడు వేలాది మంది ప్రైవేట్ ఆస్పత్రులు, ఇళ్లలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. అయితే, పారిశుద్ధ్య సమస్య పరిష్కారం, వైద్యశిబిరాల నిర్వహణలో అటు ప్రభుత్వం, ఇటు అధికారులు సక్రమంగా వ్యవహరించడం లేదని రంగారావు విమర్శించారు. ఇకనైనా యుద్ధ ప్రాతిపదికన పారిశుద్ధ్య పనులు చేయించాలని డిమాండ్ చేశారు.

22న చలో హైదరాబాద్

ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడమేకాక కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు మంజూరు చేయాలనే డిమాండ్‌తో మాస్‌లైన్ ఆధ్వర్యాన ఈనెల 22న చలో హైదరాబాద్ నిర్వహిస్తున్నట్లు రంగారావు తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు, మెస్ చార్జీల పెంపు, ఉద్యోగాల భర్తీ, అసంఘటిత కార్మికులకు భద్రత, పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలనే తదితర డిమాండ్లతో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. కాగా, హిడెన్‌బర్గ్ నివేదికలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సెబీ చైర్మన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, జి.రామయ్య, సీ.వై.పుల్లయ్య, మలీదు నాగేశ్వరరావు, తిమ్మిడి హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఉద్యమాల వేదిక.. ఏఐఎస్ఎఫ్



వేడుకల్లో పాల్గొన్న హేమంతరావు, పోటు ప్రసాద్ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: అలుపెరగని ఉద్యమాలకు వేదికగా ఏఐఎస్ఎఫ్ వేదికగా నిలుస్తోందని సంఘం మాజీ జాతీయ నాయకుడు, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఖమ్మం ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల వద్ద సోమవారం ఆయన పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్రం కోసం జరిగిన సంగ్రామంలో ఉద్యమించిన మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని, విద్యారంగ పరిరక్షణ కోసం బహుముఖ పోరాటాన్ని నిర్వహించిన చరిత్ర ఉందని తెలిపారు. మాజీ జాతీయ నాయకుడు పోటు ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఏఐఎస్ఎఫ్ పాత్ర మరవలేనిదని చెప్పారు. ఈమేరకు జాతీయ నూతన విద్యావిధానానికి వ్యతిరేకంగా పోరాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. నాయకులు ఎస్‌కే.జానీమియా, రావి శివరామకృష్ణ, బీ.జీ.క్లైమెంట్, పోటు కళావతి, తోట రామాంజనేయులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, నాగులమీరా, శివనాయక్, హరికృష్ణ, రాకేష్, రోహిత్, పవన్, మనోజ్ పాల్గొన్నారు.

నగదు చెల్లించకపోతే ఆత్మహత్య చేసుకుంటాం

పొదుపు సంఘం లీడర్ ఇంటివద్ద ఆందోళన

నేలకొండపల్లి: పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న అప్పు కిస్తీలు నెలనెలా సక్రమంగా చెల్లించినా సంఘం లీడర్ బ్యాంకులో జమ చేయకుండా సొంతానికి వాడుకోవడంతో సభ్యులు ఆందోళన దిగారు. నేలకొండపల్లికి చెందిన అంబేద్కర్ స్వయం సహాయక సంఘం లీడర్ కుమారికి సభ్యులు పొదుపు నగదుతో పాటు రుణ బకాయిలు నెలకు రూ.36 వేల చొప్పున చెల్లించారు. ఇలా రూ.3.50 లక్షల వరకు ఆమె బ్యాంకులో చెల్లించనట్లు సభ్యులకు తెలిసేలోగా ఆమె గ్రామం నుంచి వెళ్లిపోయింది. ఏడాది పాటు గాలించి ఏపీలోని నెల్లూరులో ఉంటున్నట్లు తెలుసుకోగా ఇటీవల పోలీసులు పట్టుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చాక ఖమ్మంలోని శక్తి సదన్‌లో ఉంచారు. ఆపై ఆమె సోమవారం తన నివాసానికి చేరుకోగా సభ్యులు ఆందోళనకు దిగారు. తమ డబ్బులు చెల్లించకపోతే ఆత్మహత్య చేసుకుంటామని పేర్కొనగా పోలీసులు చేరుకుని కుమారిని స్టేషన్‌కు తరలించారు. ఆపై బాధితులు కూడా వెళ్లి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఆహ్వాన నాటిక పోటీల్లో విజేతలు వీరే..

ఖమ్మంగాంధీచౌక్: నెలనెలా వెన్నెల ఏడో వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించిన తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీల విజేతలను నిర్వాహకులు సోమవారం ప్రకటించారు. ఉత్తమ నటులుగా జ్యోతిరాజ్, వాగ్దేవి, ఎస్.రవీందర్‌రెడ్డి, ఎస్ఎం.బాషా, నాగకుసుమసాయి ఎంపికయ్యారు. ప్రత్యేక నటనకు శ్రీనివాసరావు, వెంకట్, శ్రీలేఖ, భాణిశాస్త్రి, అర్జాన్‌ను ఎంపిక చేశారు. ఇక ఉత్తమ జ్యూరీ అవార్డులు జ్యోతిరాణి, ఎంవీ.రాజర్షి, మంజునాథ్‌ను ఎంపిక చేశారు. అలాగే, ఉత్తమ ప్రదర్శనగా ఇంద్రప్రస్థానం, రాత, మూల్యం నాటికలు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయని నిర్వాహకులు అన్నాబత్తుల రవీంద్రనాథ్, డాక్టర్ నాగబత్తిని రవి, వేల్పుల విజేత, మోటమర్రి జగన్మోహన్‌రావు, నామా లక్ష్మీనారాయణ, వేముల సదానందం వివరించారు.

టేబుల్ టెన్నిస్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లోని జీఎస్ అకాడమీ ఆధ్వర్యాన రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు సోమవారం ముగిశాయి. అండర్-12, 15 బాలబాలికలతో పాటు పురుషుల, మహిళల విభాగంలో పోటీలు నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీల్లో అండర్-12, 15 బాలుర విభాగాల్లో ఖమ్మం క్రీడాకారులు చాంపియన్‌గా నిలిచారు. అలాగే, పురుషుల సింగిల్స్, డబుల్స్‌లో కొత్తగూడెం క్రీడాకారులు ట్రోఫీ కైవసం చేసుకున్నారు. విజేతలకు టేబుల్ టెన్నిస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ జి.శరత్ కుమార్ తదితరులు బహుమతులు ట్రోఫీలు, పతకాలు అందజేశారు.

శ్మశానవాటికకు తాళం.. దారిలో దహనం

కొణిజర్ల: మండలంలోని పల్లిపాడులో శ్మశానవాటిక నిర్మాణం సగంలో నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. శ్మశానవాటిక పనులు పూర్తికాకపోవడంతో ఎవరూ లేనకు రాకుండా ఏడాది నుంచి గేట్‌కు తాళం వేశారు. దీంతో గ్రామంలో ఎవరైనా కన్నుమూస్తే అక్కడి సమీపాన అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలోనే సోమవారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందగా శ్మశానవాటికకు తీసుకొచ్చేసరికి శ్మశాన వాటికకు తాళం వేసి ఉంది. ఫలితంగా పక్కనే పొలాలకు వెళ్లే దారిలో దహనం చేయగా స్థానికులు అధికారుల తీరుపై మండిపడ్డారు.

40 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

కూసుమంచి: మండలంలోని బోడియాతండాలో రవాణాకు సిద్ధంగా ఉన్న 40 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని కూసుమంచి పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాలకు చెందిన మడికంటి శంకర్, చందావత్ అశోక్, బోడా అనిల్, బోడా లాటూ బియ్యం రవాణాకు సిద్ధమయ్యారు. దీంతో స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేశామని ఎస్సై నాగరాజు తెలిపారు.

తిరుమలాయపాలెంలో 26 క్వింటాళ్లు..

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం నుంచి పోలెబోయిన శ్యాంబాబు 26 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలింపునకు సిద్ధమయ్యాడు. దీంతో వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం అర్ధరాత్రి దాటాక తనిఖీలు చేపట్టి స్వాధీనం చేసుకోగా.. సివిల్ సప్లయీస్ అధికారులకు అప్పగించారు.

రెండు రోజుల వ్యవధిలో దంపతుల మృతి



సరోజిని, నర్సింహారావు (ఫైల్)

వైరారూరల్: మండలంలోని విప్పలమడకకు దంపతులు అనారోగ్యంతో బాధపడుతూ రెండు రోజుల వ్యవధిలో మృతిచెందారు. గ్రామానికి చెందిన వజినేపల్లి సరోజిని(72) తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 9న మృతి చెందింది. బంధువులతో కలిసి ఆమె అంత్యక్రియలను భర్త నర్సింహారావు(77) పూర్తిచేశారు. అప్పటినుంచి తీవ్ర మనోవేదన చెందుతున్న ఆయన ఆదివారం రాత్రి కన్నుమూశారు. వీరికి నలుగురు కుమార్తెలు ఉండగా.. రెండు రోజుల వ్యవధిలో భార్యాభర్తలు మృతి చెందడంపై గ్రామంలో విషాదం నెలకొంది.

చికిత్స పొందుతున్న యువకుడు..

చింతకాని: మండలంలోని పాతర్లపాడు చెందిన మాతంగి రమేష్(30) ఇటీవల పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఆయనకు దళితబంధు పథకంలో భాగంగా ట్రాక్టర్ రాగా మరమ్మతు కోసం కుటుంబీకులను డబ్బు అడిగాడు. ఆపై మనస్థాపానికి గురైన ఆయన 10వ తేదీన పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై రమేష్ తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

జ్వరంతో వ్యక్తి...



శ్రీనివాసరావు (ఫైల్)

కామేపల్లి: జ్వరంతో బాధపడుతూ మండలంలోని ఊట్కూర్‌కు చెందిన ఎల్లబోయిన శ్రీనివాసరావు(38) సోమవారం మృతి చెందాడు. వారం క్రితం ఆయనకు జ్వరం రాగా ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూనే పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు.

అనుమానాస్పద స్థితిలో మహిళ..

ఖమ్మంక్రైం: ఖమ్మం వన్‌టౌన్ పరిధిలో ఓ మహిళ అనుమానస్పద స్థితిలో మృతి చెందిన ఘటనపై సోమవారం కేసు నమోదైంది. ఏపీలోని రాజమండ్రికి చెందిన గురాల కాశీవిశాలక్ష్మి(40) నాలుగేళ్లగా ఖమ్మంలో అద్దెకు ఉంటూ టీవీ చానళ్లలో కార్యక్రమాలు చేసేది. ఆమెకు ఆమెకు 2007లో వివాహం జరిగి ఇద్దరు ఆడపిల్లలు జన్మించగా.. ఖమ్మంలో నాగేశ్వరరావుతో పరిచయం ఏర్పడగా భర్తకు విడాకులు ఇచ్చి ఖమ్మం అల్లీపురం రోడ్డులోని శ్రీకృష్ణ నగర్‌లో నివసిస్తోంది. ఆమె వద్దకు నాగేశ్వరరావు తరచుగా వచ్చివెళ్లేవాడు. అయితే, కొన్నాళ్లుగా మానసిక ఆందోళనకు గురవుతున్న విశాలాక్ష్మి చికిత్స చేయించుకున్నట్లు తెలుస్తుండగా ఆదివారం ఇంట్లో నుంచి బయటకు రాకపోవడంతో యజమాని కిటికీలో నుంచి చూడగా కింద పడి ఉంది. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు చేరుకుని బలవంతంగా తలుపులు తెరిచి చూసేసరికి అప్పటికే మృతి చెందింది. కాగా, విశాలాక్ష్మి తలవెనుక భాగంలో గాయం, చేతికి కమిలిన గాయాలు ఉండడంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడిందా.. సహజ మరణమా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఖమ్మం వన్‌టౌన్ ఏఎస్ఐ గౌస్ తెలిపారు.

వాహనం ఢీకొని వ్యక్తి..

పెనుబల్లి: మండలంలోని గణేష్‌పాడు రోడ్డు సమీపాన గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఏపీలోని ఏ.కొండూరు మండలం గోపాలపురానికి చెందిన పెద్దిబోయిన నాగేశ్వరరావు, ఇరికిబోయిన నరసింహారావు కొంత కాలంగా పశువుల వ్యాపారం చేస్తున్నారు. వీరిద్దరు ఆదివారం పెనుబల్లి మండలం ఎల్ఎస్ బంజర్‌లో పశువులను చూసి స్వస్థలానికి వెళ్తుండగా వారి వాహనం నిలిచిపోయింది. దీంతో నాగేశ్వరరావు(48) పెట్రోల్ తీసుకొస్తానని వెళ్తుండడంతో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా మృతి చెందాడు. ఆయనకు ఎంతకూ రాకపోవడంతో నరసింహారావు వెళ్తుండగా నాగేశ్వరరావు కింద పడి ఉండడాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. ఆయన బంధువుల ఫిర్యాదుతో సోమవారం ఫిర్యాదు చేశారని ఎస్సై కె.వెంకటేశ్వరరావు తెలిపారు.